

న్యూస్ బాక్స్

18న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సదస్సు

సుల్తానాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండ థామస్ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లో జరిగే ఈ రాష్ట్ర స్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా మంద కృష్ణమాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు పెద్దపల్లి జిల్లా నుంచి పెద్ద ఎత్తున మాదిగలు, ఉపకులాల వారు తరలిరావాలని కోరారు.

రేపు ఖనిలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం సాయంత్రం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ డినామినేషన్ పాస్టర్స్ ఫెలోషిప్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మహి పాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డిలైట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్ర మానికి క్రీస్తు జ్యోతి మినిస్ట్రీస్, వరంగల్ వ్యవస్థాపకులు రేవ పాల్సన్ రాజు, డైరెక్టర్ జయప్రకాష్ హాజరై ప్రసంగిస్తారని అలాగే ముఖ్యఅతిథులుగా రామ గుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి క్రైస్తవులు, విశ్వాసులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని, వివరాలకు వేడుకల కోఆర్డినేటర్లు ఆర్ జిమ్మిబాబు, దయానంద్‌గాంధీ, విలాసాగరపు శ్రీనివాస్‌లను సంప్రదించాలని కోరారు.

- ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో అమలు కాని హామీ
- ఇప్పుడైనా అందించాలని విద్యార్థుల వినతి



కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలయ్యేనా..?

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రభుత్వ పాఠశాలల్లో వలే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, ఐటీఐ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం పూట భోజనం లేక అలమటి స్తున్నారు. కొందరు విద్యా ర్థులు మధ్యాహ్నమే ఇళ్లకు వెళ్తున్నారు. వివిధ కారణాలతో ప్రతి ఏటా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపో తున్నది. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే విద్యా ర్థులకు చాలా ఉపయోగకరంగా ఉండనుంది. చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల బాట పడుతున్నారు. పెద్దపెల్లి జిల్లాలో 16 జూనియర్ కళాశాలతో పాటు పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానా బాద్, మంథని, తదితర ప్రాంతాల్లో డిగ్రీ కళాశాలలు ఉన్నా యి. ఈ కళాశాలల్లో ప్రస్తుతం 3000 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రయివేటు జూనియర్ కళాశాలలతో పాటు డిగ్రీ కళాశాలలు కూడా ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యా హ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని కేవలం ఎని మిదో తరగతి వరకే కొనసాగిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 9,10వ తరగతి చదివే విద్యార్థులకు కొనసాగిస్తున్నది. అలాగే జూనియర్, డిగ్రీ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆయా ప్రభుత్వాలను కోరుతూ వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయిన తర్వాత తొలి సారిగా అధికారంలోకి వచ్చిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాలలోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల ఎంత ఖర్చు అవుతుందని ఆరా తీశారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు ఐటీఐ చదివే విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ప్రతి ఏటా 300 కోట్ల రూపా యల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు ఫైల్ సిద్ధం చేయగా, అమలుకు నోచుకోలేదు. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మధ్యా హ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చా రు. కానీ అమలుకు నోచుకోలేదు. దీని పర్యవసానంగా చాలామంది విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థు లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా ఉంటారు. ఆర్థికంగా ఉన్న వాళ్ల ప్రయివేట్ కళాశాలలకు వెళుతున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో లేని కారణంగా చాలామంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు..

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ జూని యర్, డిగ్రీ, అయితే కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తారని ఆశలు నెలకొన్నాయి. విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు నడుం బిగించారు. 11 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, 26 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో 8 ఏళ్లుగా కొనసాగుతున్న మెస్ చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచారు. మెనూ కూడా మార్చే శారు. దీంతో ప్రభుత్వ ఇంటర్, ఐటీఐ, డిగ్రీ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తారని ఆశలు పెరిగాయి. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ స్పం దించి ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

బస్సుజాతా పోస్టర్ల ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ ఆశా వర్కర్స్ యూని యన్ (సీఐటీయు) కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల రాష్ట్ర బస్సు జాతా పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు జి జ్యోతి మాట్లాడుతూ డిసెంబర్ 17న జిల్లాకు రానున్న బస్సు జాతా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. ఆశా వర్కర్లకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు 18 వేల రూపాయలు నిర్ణయిస్తామని హామీ ఇచ్చా రని, ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి జయలక్ష్మి ఆధ్వర్యంలో 10 మంది యూనియన్ రాష్ట్ర బృం దం బస్సు జాతా కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ బస్సు జాతా కార్యక్ర మంలో జిల్లాలోని ఆశ వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశా వర్కర్లకు అధిక పనిభారం తగ్గించాలని పీఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ .జ్యోతి ,యు వెంకటేశ్వరి, కే.అరుణ , వి పద్మ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో

9,642కేసుల పరిష్కారం

● 82 సైబర్ క్రైమ్ బాధితులకు రూ.8.58లక్షలు రికవరీ

కోల్‌సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ కోర్టుల్లో 9,642 కేసులు పరిష్కారం అయినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన విచారణలో ఉన్న 784కేసులు, డ్రంకెన్ డ్రైవ్, మోటార్ వెహికల్ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల కేసులు 3,045, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులు 428 పరిష్కారమయ్యాయన్నారు. ఈ పెట్టీ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం తదితర కేసులు 5,385 పరిష్కారం అయినట్టు సీపీ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ లోక్ అదాల త్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది 15రోజుల నుంచి వివిధ కేసులకు సంబంధించిన కక్షిదారులతో స్వయంగా మాట్లాడి రాజీకి ప్రోత్సహించారన్నారు. దీని ద్వారా ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. త్వరలో కోర్టు సిబ్బందికి, కేసులు మానిటరింగ్ చేసిన అధికారులకు రివార్డులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దపల్లి రూరల్ , డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవ పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం పెద్దపల్లి పట్టణా నికి చెందిన ఎంఎంఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యులు మోహిన్ పాష 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది నాజీయా, జోగేష్ తదితరులు పాల్గొన్నారు.



మీర్జంపేట పల్లెప్రకృతివనంలో ఎండిన మొక్కలు

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు

- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- వృథా అవుతున్న నిధులు

6 కాల్వశ్రీరాంపూర్



పెద్దపల్లిలో పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

- మొదటిరోజు ప్రశాంతం
- ఉదయం 49.34 శాతం..

సాయంత్రం 48.98 శాతం హాజరు

8

గ్రామపంచాయతీ ఉద్యోగులను ఆదుకోవాలి

ఓదెల, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు నెలల నుంచి ఆరు నెలల వరకు జిల్లాలో వేతనాలు లేక ఇబ్బంది పడుతున్న గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామపంచాయతీ సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు రవీందర్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వ హించిన గ్రామపంచాయతీ కార్మిక సంఘం సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికుల మెడకు ఉరితా డులా ఉన్న మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే 51 జీవోను సవరించాలని కోరారు. ఈ నెల 17న ఇందిరాపార్కులో నిర్వహించనున్న చలో హైదరాబాద్ ను విజ యవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఆకుల నరేష్, పైడిపల్లి నాగరాజు, లింగ య్య, ఇంద్రారెడ్డి, తిరుపతి, లక్ష్మీ, కృష్ణయ్య, రాజయ్య, పవన్ పాల్గొన్నారు.

వోపా ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

మంథని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వోపా ఆధ్వర్యంలో పట్టణంలోని పేద విశ్వబ్రా హ్మణలకు దుప్పట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి, వోపా నేతలు తంగళ్ల పల్లి మధూకర్, ముల్కల్ల రాజశేఖర్, కొము రోజు శ్రీనివాస్ ఆదివారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నేతలు వంగల తిరులేష్, మోదుంపురం విజయ్‌కుమార్, కనపర్తి సత్యనారాయణ, దశరథం, సూర్యప్రకాష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రం

● సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు గోవర్ధన్ అన్నారు. ఆదివారం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని స్నేహసాహితి గ్రంథాలయంలో జరిగిన పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. పేద ప్రజల, శ్రామికుల విముక్తి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానా లను తిప్పికొట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందని, దానికి వ్యతిరేకంగా విప్లవ కార్మిక సంఘాలు పోరాటం చేయాల న్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, న్యూడె మోక్రసీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రామన్న, రాజేందర్, రాజేశం, మల్లేష్, స్వామి, శేఖర్, ప్రసాద్, పద్మ, దేవయ్య, సంపత్ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

● ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు తెలిపారు. ఆదివారం బండారుకుంటలో ఉన్న ఎస్సారెస్పీ డి83/22ఆర్ నుంచి కాల్వశ్రీరాంపూర్ మండ లంలోని ఎదిలాపూర్ వరకు ఉన్న 83 కాలువను స్థానిక నాయకులు, ఎస్సారెస్పీ అధికారులతో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడు తూ.. డి 83 /22 ఆర్ ఎస్సారెస్పీ కాలువలో అక్కడక్కడ చెత్త చెదారంతో నిండిపోయి ఉందని, పూడికను తీసివే యించి అక్కడక్కడ పాడైపోయిన కాలువను మరమ్మతు లు చేయిస్తామన్నారు. రానున్న వేసవిలో ఎస్సారెస్పీ ప్రాజెక్టు చివరి ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అంది స్తామని ఆయన తెలిపారు. గత వేసవిలో కాల్వ శ్రీరాంపూర్ మండలం జాఫ ర్‌ఖాన్‌పేట శివారులో ఎస్సా రెస్పీ కాలువ పూడికతో నిండి పోగా స్వయంగా ఎక్స్‌కావేట ర్‌తో సుమారు మూడు కిలోమీటర్ల గుర్రాంపల్లి శివారు వరకు తాను పూడిక పూడిక తీయించినట్లు గుర్తు చేశారు. ఈ పనులను పూర్తి చేయాలని ఎస్సారెస్పీ అధికారులను ఎమ్మె ల్యే ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఇరిగేషన్ అధికారులు, మాజీ ఎంపిపి సారయ్య గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, సింగిల్ విం డో చైర్మన్లు నర్సింహారెడ్డి,రామిడి తిరుపతిరెడ్డి,ఎనగందుల ప్రదీప్, భూతగడ్డ సంపత్, అరె సంతోష్,గజానావేణి సద య్య, తూముల శుభాష్, ఉప్పు రాజు, కలవేణి మహేం దర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఓదెల, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం పర్యాటక ప్రాంతాలకు ప్రదేశాలకు తరలివెళ్లారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో కొలను పాకలోని ప్రసిద్ధ జైన మందిరం, అలాగే యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, తెలంగాణ తిరుమల తిరుపతిగా పేరుగాంచిన స్వర్ణ గిరి క్షేత్రాలను సందర్శించారు. తరగతి గదుల్లో బోధించిన వివిధ అంశాలను ప్రత్యక్షంగా చూస్తూ విద్యార్థులు అవగాహన పెంపొందించుకున్నారు. దర్శనీయ స్థలాలను చూసి విద్యార్థుల సంతోషం వ్యక్తం చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విధంగా గత ఏడేళ్లుగా విద్యార్థులను విజ్ఞానం కోసం విహారయాత్రలకు తీసుకెళ్లి అవగాహన పెంపొందిస్తున్నామని, దీంతో విద్యార్థుల్లో కొత్త అనుభూతులు, అనుభవాలు, విజ్ఞానం, వికాసం కలుగుతుందని ఉపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు విద్యతోపాటు వికాసం పెంపొందించేందుకు విహారయాత్రలు అతి ముఖ్యమని తెలిపారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ విహారయాత్రలో ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి తోపాటు సూత్రాల శ్రీనివాస్, పావని, హేమలత, హైమావతి, తోటరాజు తదితరులు పాల్గొన్నారు.



కొలనుపాక జైన దేవాలయం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూమన్న

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో చేయాలని బీజేపీ ఎన్నికల అధికారి భూమన్న పిలుపు నిచ్చారు. ఆదివారం మార్కండేయ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో 27వేల మంది సభ్యత్వాలు నమోదు చేసినట్లు తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వాన్ని నమోదు చేశారని, 259 పోలింగ్ బూత్‌లకు 150పోలింగ్ బూత్‌లలో వంద కుపైగా సభ్యత్వ నమోదు చేయగా, 100 పోలింగ్ బూత్‌ల్లో 50కిపైగా సభ్యులను నమో దు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 31మంది సభ్యులతో త్వరలో కమిటీ వేయనున్నట్లు, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సహాయ ఎన్నికల అధికారి క్యాతం వెంకటరమణ, నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, ఆరుముళ్ల పోషం, మేరుగు హన్మం తుగౌడ్, గుండబోయిన లక్ష్మణ్, సుల్వ లక్ష్మీనర్సయ్య, భీమయ్య, పవన్, అపర్ణ, పద్మ, రాజ్‌కుమార్, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వాసవిమాత ఆలయంలో వెండి గడప ప్రతిష్ఠాపన

మంథని, డిసెంబరు 15: స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్య వైశ్య సంఘం సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో వెండి గడప ప్రతిష్ఠ, అలంకరణను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదోక్తంగా అమ్మవారికి బంగారు అభరణా లు, సారెను సమర్పించడంతో పాటు గర్భాలయ గడపకు వెండి ప్రతిష్ఠ అలంకరణ చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, చండి హోమం, పారాయ ణాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఇబ్బందులు

● యాసంగిలోనూ సన్నవడ్లకు రూ.500 బోనస్ ● పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ● పెద్దపల్లి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

పెద్దపల్లి, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో రైతులు అరిగోస పడ్డారని, ధాన్యం కొను గోళ్లలో కోతలు విధించి రైతులను నిలువు దోపిడీ చేశా రని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయ డంతో పాటు, సన్నధాన్యానికి 500 రూపాయల బోనస్ యాసంగికి కూడా ఇస్తామన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. నాయకులు నీతి, నిజాయితీతో పనిచేస్తే గుర్తింపు వస్తుందన్నారు.

● అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే తన ధ్యేయమని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పెద్దపల్లిలో బైపాస్ రోడ్డు నిర్మాణం మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ప్రజల చిరకాల వాంఛబస్ డిపో ఏర్పాటు, రూ.80 కోట్లతో మానేరుపై రూపునారాయణపేట వద్ద హైలెవల్ వంతె న నిర్మాణం, రూ. 80 కోట్లతో పెద్దపల్లిలో ఇంటిగ్రే టెడ్ స్కూల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిం చానని చెప్పారు. చేసిన పనులను పార్టీ శ్రేణులు ప్రజ ల్లోకి తీసుకెళ్లాలన్నారు. పెద్దపల్లిలో పార్కు ఏర్పాటు కు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రం థాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాష్ రావు, తిరుపతి రెడ్డి, విండో చైర్మన్లు నరసింహారెడ్డి, చింతపండు సంపత్, నాయకులు గోపగాని సారయ్య గౌడ్, నూగిల్ల మల్లయ్య, బండారి రాంమూర్తి, జడల సురేందర్, మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప



ఎడ్లబండిపై ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

● మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమ క్షంలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాల కవర్గంతో మార్కెట్ రీజనల్ డైరెక్టర్ పద్మావతి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్ పర్సన్‌గా ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్‌గా కూర మల్లారెడ్డి, సభ్యులుగా సోమ చంద్రయ్య (రాగినేడు), మాడగోని శ్రీనివాస్ గౌడ్ (గుర్రాంపల్లి), కొలిపాక కనకయ్య (కనగర్తి), వేగోళపు పెద్ద రాజేశం (తుర్కల మద్దికుంట), పిట్టల కొమురయ్య (పిట్టల ఎల్లయ్యపల్లి కనగర్తి), గౌస్ మియా (అందుగులపల్లి), గోపతి సదానందం (ఓదె ల), కొల్లూరి రాంచంద్రం (కొలనూరు), తిప్పారపు ప్రభాకర్ (గూడెం), నరోత్తం రెడ్డి (పెద్ద బొంకూర్), ఎడ్ల మహేందర్ (పెద్దపల్లి) ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, ఉన్నత శ్రేణి మార్కెట్ కార్యదర్శి పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు. నూతన పాలకవర్గ చైర్ పర్సన్, సభ్యు లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

పరిగెడితే పతకమే



నాసిక్‌లో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకంతో రామానుజమ్మ

- ఏడు పదుల వయస్సులో అథ్లెట్‌గా రాణింపు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు
- సత్తాచాటుతున్న మాస్టర్ అథ్లెట్ తమటం రామానుజమ్మ

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏడు పదుల వయస్సులో ఆమె అలుపెరగని పరుగు తీస్తోంది. మాస్టర్ అథ్లెట్‌గా సత్తా చాటుతూ నంబరువన్‌గా నిలుస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన తమటం రామానుజమ్మ మాస్టర్ అథ్లెటిక్స్‌లో 70 సంవత్సరాల వయస్సు పైబడిన విభాగాల్లో పరుగు పందెంలో తనకు ఎవరూ సాటి లేరని నిరూపిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. రామానుజమ్మకు చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి. పాఠశాల నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు దాదాపు వెయ్యి పతకాల వరకు సాధించింది. చిన్నతనంలో అమ్మనాన్న, వివాహ అనంతరం భర్త సహకారంతో అథ్లెటిక్స్‌లో విజయం సొంతం చేసుకుంది. మాస్టర్ అథ్లెటిక్స్ మహిళల 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంలో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజయాలను సాధించింది. 2023లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో, తమిళనాడు కోయంబత్తూర్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో 200, 400, 800 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. 2018లో తెలంగాణ గచ్చిబౌలిలో జరిగిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, బొంబాయిలో 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించింది. 2024 మహారాష్ట్ర నాసిక్‌లో, యూపీ అయోధ్యలో 800, 1500 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలను సాధించింది. 2023 సెప్టెంబరులో మలేషియాలో జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో భారత్ నుంచి పాల్గొన్న తమటం రామానుజమ్మ 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించి 70 సంవత్సరాల వయస్సులో దేశానికి వన్నె తెచ్చింది. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకం సాధించిన రామానుజమ్మను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు సన్మానించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా దాతల సహకారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది. ప్రభుత్వం నుంచి మాస్టర్ అథ్లెటిక్స్‌కు కూడా సహకారం అందించాలని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం 71 సంవత్సరాల రామానుజమ్మ నిత్యం యోగా సాధన కూడా చేస్తోంది.



మలేషియాలో కాంస్య పతకం సాధించిన తరువాత జాతీయ జెండాతో రామానుజమ్మ

మనస్సు ఆనందంగా ఉంటే వయస్సు తగ్గుతుంది

- తమటం రామానుజమ్మ, మాస్టర్ అథ్లెట్, అంతర్జాతీయ క్రీడాకారిణి



మనస్సును ఆనందంగా ఉంచితే వయస్సు తగ్గుతుంది. ఇదే నా ఆరోగ్య రహస్యం. మాస్టర్ అథ్లెట్‌గా రాణించడానికి మనస్సును ఆనందంగా ఉంచడమే ప్రధాన కారణం. ప్రతీరోజు యోగా, వ్యాయామంతో ఫిట్నెస్ సాధిస్తున్నాను. అనారోగ్య(బీపీ, షుగర్) సమస్యలు లేకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తున్నాను.

అథ్లెట్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహించాలి

- గొట్టెముక్కల శేఖర్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది క్రీడాకారులు మరుగున పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులను ప్రోత్సహించాలి. మాస్టర్ అథ్లెట్స్‌కు ప్రభుత్వం కొని నిధులను కేటాయించాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి ఎంపికైన క్రీడాకారులు సొంత డబ్బులతో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లలేక పోతున్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

- సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

గోదావరిఖని, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూ నిత్యం ప్రజల మధ్య ఉండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సీపీఐ నాయ కులకు సూచించారు. ఆదివారం భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు కమ్యూనిజాన్ని ఆదరిస్తున్నారని, అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావడమే కారణమన్నారు. డిసెంబర్ 26 సీపీఐ వంద సంవత్సరాల్లోకి అడుగు పెడుతుందని, ఈ సందర్భంగా వాడవాడన, గ్రామ గ్రామాల వంద వసంతాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. వంద సంవత్సరాల చరిత్రలో కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని, రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థులకు సంబంధించిన అనేక హక్కులను సాధించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడవ సారి అధికా రంలోకి వచ్చిన తరువాత ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ జమిలి ఎన్నికలకు తహతహలాడుతున్నాని, దేశంలో ప్రజలపై పన్ను భారా న్ని మోపుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకుండా ఒక్కో వస్తువుపై ఒక్కో రకమైన పన్ను విధిస్తున్నారన్నారు. రాబోయే కాలం ఎన్నికల కాలమని, స్థానిక సంస్థలతో పాటు పంచాయతీ, మండల ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త గెలుపు కోసం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, మడ్డి ఎల్లయ్య, స్వామి, ఆరెల్లి పోషం, తాళ్లపల్లి మల్లయ్య, మార్కపురి సూర్య, ప్రీతం, ఓదమ్మ, కన్నం లక్ష్మీనారాయణ, రాజయ్య, లెనిన్, రమ, దప్పు రాజు, మొండి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాకేష్ (ఫైల్)

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామ శివారులో ఓ యువకుడు ద్విచక్రవాహనం మీద నుండి కింద పడి మృతి చెందాడు. వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గురుకుంట్ల రాకేష్ (30) శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా జగ్గయ్యపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనంపై అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికి అక్కడే మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడం వల్లే రాకేష్ మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. రాకేష్‌కు నవంబరు 10న నిశ్చితార్థం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

హుజూరాబాద్‌లో ప్రైవేట్ స్కూల్ వ్యాన్ దగ్ధం

హుజూరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరంగల్ రోడ్‌లో గల మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో పార్క్ చేసి ఉన్న స్కూల్ వ్యాన్ ఆదివారం దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం పాఠశాల ఆవరణలో నాలుగు వ్యాన్లు పార్క్ చేసి ఉండగా, ఒక వ్యాన్‌లో నుంచి మంటలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. సెలవు దినం కావడంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే నివేశన గృహాలు, సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు మద్యం తాగి, అగ్గిపెట్టె, సిగరెట్లు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పాఠశాల యాజమాన్యం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


దగ్ధమైనస్కూల్ వ్యాన్

విద్యార్థినికి వేధింపులు.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు ప్రాంతంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిని అదే కళాశాలకు చెందిన ఉద్యోగి అసభ్యకరంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశాడని అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు. కొద్ది రోజులుగా విద్యార్థినిని వేధింపులకు గురి చేస్తుండడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. కాగా ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు ఎస్ఐ సాంబమూర్తి నిరాకరించారు.

గంజాయి పట్టివేత


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అశోక్‌నగర్ ప్రాంతంలో గంజాయిని పట్టుకుని నిందితుడిని అరెస్టు చేశామని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన నీరజ్‌కుమార్(19)ను అశోక్‌నగర్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుంచి కిలో 655 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. బీహార్ రాష్ట్రంలోని పర్వటిర్‌బల్ ప్రాంతానికి చెందిన నీరజ్‌కుమార్ 8 నెలల క్రితం కరీంనగర్‌కు వచ్చి కూలీగా పనిచేస్తుండేవాడు. ఐదు నెలల కిందట బీహార్‌కు వెళ్లిన నీరజ్‌కుమార్ అక్కడ గంజాయికి అలవాటుపడ్డాడు. డబ్బులు లేకపోవడంతో కరీంనగర్‌లో గంజాయిని విక్రయించి సంపాదించాలని పథకం వేశాడు. బీహార్‌లో 2 కిలోల గంజాయిని కొనుగోలు చేసిన నీరజ్‌కుమార్ 15 రోజుల కిందట కరీంనగర్‌కు చేరుకున్నాడు. కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో అద్దె గదిలో ఉంటూ నిత్యం గంజాయి సేవించేవాడు. మిగతా గంజాయిని విక్రయించేందుకు శనివారం సాయంత్రం గౌరిశెట్టి కాంప్లెక్స్ వద్ద ఉండగా అప్పుడే అక్కడకు వచ్చిన పోలీసు వాహనాన్ని చూసి నీరజ్‌కుమార్ పారిపోయేందుకు ప్రయత్నిం చాడు. వెంటనే పోలీసులు అతడిని తనిఖీ చేసి కిలో 655 గ్రాముల గంజాయి, ఒక మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నీరజ్‌కుమార్‌ను ఆదివారం కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

ఆదివారం.. ఆధ్యాత్మికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. మల్లన్న బోనాలు, అయ్యప్ప పడిపూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాజన్న ఆలయం భక్తజన సంద్రంగా మారింది. జగిత్యాల జిల్లాలోని మల్లన్నపేట మల్లికార్జున ఆలయంలో బోనాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు వేల సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


రాజన్న దర్శనం కోసం క్యూలో బారులుదీరిన భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. షష్టిమాసం సందర్భంగా ఆదివారం స్వామివారి ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. మల్లన్న పట్నాల నేపథ్యంలో ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులు తెల్లవారు జాము నుంచే రాజన్న దర్శనం కోసం క్యూలో బారులుదీరారు. అనంతరం ఆలయంలోకి ప్రవేశించి రాజన్నను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోడెమొక్కు క్యూలో రాజన్న దర్శనానికి మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- ఆలయాలను సందర్శించిన ప్రభుత్వ విప్

వేములవాడలోని పలు దేవాలయాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. పట్టణంలోని దత్తాత్రేయస్వామి, కేదారేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేదారేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

వెల్గటూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం అంగరంగ వైభంగా నిర్వహించారు. గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమం భక్తితో నిర్వహించారు. అనంతరం రత్నాకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ మెరుగు మురళి, బండెల ఉదయ్, అయ్యప్ప దీక్షపరులు పెద్ది శ్రీనివాస్, గంట్యాల రాజేందర్, సంకోజు నరేష్, సిరంగి సంతోష్ కుమార్, బొడకుంటి రమేష్, మనీష్, రామస్వామి, పెద్దూరి భరత్ పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామికి హారతి ఇస్తున్న అయ్యప్ప దీక్ష స్వాములు


ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

భక్తుల పెన్నిధి..మల్లన్న సన్నిధి...

- భారీగా తరలివచ్చి.. బోనాలు సమర్పించిన భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం అంతా కిటకిటలాడింది. జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం, సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరసర ప్రదేశాలు ఎటూ చూసిన భక్తులతో పోటెత్తింది. ఆలయం నలువైపులా వాహనాలతో, భక్త జనసందోహంతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, స్వామివారికి ప్రీతిపాత్రమైన బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుక నాదాలు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ. 96,030 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యం కల్గకుండా ఎస్‌పీసీ విద్యార్థులు సేవలను అందించారు. జాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించగా, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు

- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- వృథా అవుతున్న నిధులు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 15,(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతి వనాలను పట్టించుకోకపోవడంతో లక్షలు రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మొ క్కలతో పాటు ఇతర వసతులు వృథాగా మారాయి. గ్రామాల్లో ఆహ్లాదం కోసం పల్లె పార్కులుగా తీర్చి దిద్దాలనే ఆలోచనతో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి వృథాగా మారాయి. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని 24గ్రామపంచాయతీలు ఉండగా మంగపేట మినహా మిగతా 23గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ భూములను గుర్తించి గత ఐదు సంవత్సరాల క్రితం లక్షలు ఖర్చుచేసి మొక్కలు నాటారు. వాటి నిర్వహణ కూడా ప్రభుత్వం డబ్బులు వెచ్చించింది. ఉపాధి హామీ పథకం గ్రామాల్లో పలె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసశారు. పిల్లలు, పెద్దలు సేదతీర్చుకునేందుకు, వనాలలో వాకింగ్ ఇతర ఆరోగ్యకరమైన ఎక్సర్‌సైజ్ చేసుకునేందుకు వీటిని తీర్చి దిద్దారు. పల్లెప్రకృతి వనాలు పెట్టి సుమారు రెండు సంవత్సరాల వరకు ఉపాధిహామీ సిబ్బంది చూసుకునేది. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పల్లెప్రకృతి వనాలలో మొక్కలకు నీరు పోయించడంతో పాటు వనాలలో పెరిగిన గడ్డి కూడా ఈజీఎస్ కూలీలద్వారా తీయించారు. పల్లె ప్రకృతి వనానికి ఒక్కొక్క గ్రామానికి సుమారు లక్ష రూపాయల నుంచి 1.70.000 ఉపాధిహామీ ద్వారా ఖర్చు చేశారు. పల్లెప్రకృతి వనాలు కొన్ని గ్రామాలలో గ్రామానికి దూరంగా ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు ఈజీఎస్ ద్వారా పల్లెప్రకృతి వనసంరక్షణ నిర్వహించి అనంతరం ఈజీఎస్ తప్పుకొని గ్రామపంచాయతీలకు అప్పగించారు. గ్రామపంచాయతీకి అప్పగించడంతో ప్రకృతి వనం నిర్వహణపై పెద్దగా మొగ్గుచూపులేదు. ప్రస్థుతం గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామ కార్యదర్శులు కూడా పల్లెప్రకృతి వనాలను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఏపుగా పెరిగిన మొక్కల నిర్వహణలేక ఎండిపోతున్నారు. ప్రభుత్వం ప్రకృతి వనాలకు లక్షలు ఖర్చుచేసి మొక్కలను పెంచితే నిర్వహిణ లేక ఎండిపోతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి వనాలను సంర క్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మీర్జంపేట పల్లె ప్రకృతివనం


మీర్జంపేటలోని పల్లె ప్రకృతివనంలో ఎండిపోయిన చెట్లు

ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ


ధర్మపురి గోదావరి నది వద్ద స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. అనంతరం భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేశారు. నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు తిరుగు ప్రయాణం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి నది వద్ద మల్లన్న భక్తులతో సందడి నెలకొంది. ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నదీ వరకు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలుగనీయకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నదిలో స్నానాలు ఆచరించిన అనేక మంది భక్తులు స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- వైభవంగా దత్తాత్రేయుడి జయంత్యుత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బోయినపల్లి మండలం వరదవెల్లి గుట్టపై ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త జయంత్యుత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ మిడ్ మానేరు బ్యాక్ వాటర్ నుంచి గుట్ట పైకి వంతెన త్వరితగతిన నిర్మించేలా చూస్తానన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకునేందుకు మంత్రి పొన్నం విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోటు ద్వారా గుట్టపైకి చేరుకున్నారు. దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రి వెంట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు రవీందర్, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు ఉప్పుల అంజన్ కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాగాని వెంకటేష్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ



లక్ష్మీనరసింహస్వామి శావతో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెల్గటూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా కిషన్‌రావుపేట లోని శ్రీ నాగపల్లి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అర్చకులు స్వామి వారి అర్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పాటలు పాడుతూ భజన చేస్తూ గిరి ప్రదక్షిణ నిర్వహించారు. నర్సింహస్వామి గోవిందా... గోవిందా అంటూ ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం చెక్కబండి దామోదర్‌రెడ్డి వనజారెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, గౌరవ అధ్యక్షులు పూదరి రమేష్, కుమ్మరి వెంకటేష్, తరాళ్ల శివకుమార్, పాదం వెంకటేష్, గౌరు తిరుపతి, పాదం సాయి, రాయమల్లు పాల్గొన్నారు.

భక్తులపై తేనెటీగల దాడి

చందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : చందుర్తి మండలం మర్రిగడ్డ మల్లికార్జున స్వామి ఆలయంలో మొ క్కులు చెల్లించేం దుకు వచ్చిన భక్తులపై ఆదివారం తేనెటీగల దాడి చేయడంతో పదిమందికి పైగా గాయపడ్డారు. మండలంలోని మర్రిగడ్డ శివారులోని మల్లికార్జున స్వామి ఆలయంలో బోనం మొక్కు చెల్లించేందుకు భక్తులు వచ్చారు. ఆలయ పరిసరాల్లోని గిరక తాటి చెట్ల వద్ద బోనం వండేందుకు పొయ్యి ఏర్పాటు చేసుకొని మంట పెట్టారు. పొగ రావడంతో గిరక తాటి చెట్లపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి అక్కడ ఉన్న భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో మరి గడ్డకు చెందిన మల్యాల అంజయ్య, భైరగోని ఎల్లయ్య, మల్యాల రాజవ్వ, కత్తి లస్మవ్వ, మల్యాల లక్ష్మి, స్రవంతితోపాటు వట్టెంల గ్రామానికి చెందిన పచ్చిమట్ల మల్లవ్వ అనే వృద్ధురాలు, ఐదేళ్ల గగన అనే బాలిక మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వెంటనే బాధితులను చికిత్స నిమిత్తం వేముల వాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఆకుల కొమురయ్య గౌడ్ ఆదివారం ప్రమాదవశాత్తు ఈతచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు కొమురయ్యను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృత్తిపై ఆధారపడ్డ గీత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని , కొమురయ్యకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని గౌడ కులస్థులు కోరారు.

అదుపు తప్పి లారీ బోల్తా

మల్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు స్టేజీ సమీపంలో శనివారం అర్థరాత్రి జగిత్యాల వైపు వెలుతున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. రాత్రి సమయం కావడంతో ఇతర వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. లారీ వివరాలు తెలియక పోగా ఎలాంటి నష్టం జరుగలేదని స్థానికులు తెలిపారు. లారీ త్వరగా తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు ఆలస్యం అయింది.

స్వామియే.. శరణం అయ్యప్ప

- కఠిన నియమాల దీక్ష
- ఆధ్యాత్మికత, క్రమశిక్షణాయుత జీవితానికి దోహదం



కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప దీక్ష కఠిన మైంది. అనేక నియమ నిబంధనలతో కూడుకున్నది. దీక్ష తీసుకున్న వ్యక్తి ఆధ్యాత్మిక, క్రమశిక్షణాయుత జీవితానికి అలవాటు పడుతాడు. దేహమే దేవాలయం, పరిశుభ్రతే పరమాత్మ అని నమ్మి దేహంతో పాటు ఇల్లు, పరిసరాలు, ఆలయాలు శుద్ధిగా ఉంచుకుంటూ దీక్షలు కొనసాగిస్తే దక్షత పెరుగుతుంది. ఆరోగ్యం , ఆధ్యాత్మికత, ప్రశాంతత, సరికొత్త జీవన విధానం ఏర్పడుతాయి. దీక్షల్లో స్థాయిలను బట్టి కన్నె, కత్తి, గంట, గద, గురు స్వాములుగా వ్యవహరిస్తుంటారు. ఏ స్థాయి స్వామి అయినా ప్రతి దీక్షాపరుడు ఓ అయ్యప్ప ప్రతిరూపంగా భావిస్తుంటారు. వ్యక్తిలో పరమాత్మను దర్శించాలన్నదే దీని పరమార్థం. తొలిసారి దీక్షను స్వీకరించే వారు తల్లి లేదా గురుస్వామి చేతుల మీదుగా స్వీకరిస్తారు.

దీక్షను ద్విగుణీకృతం చేసుకోవాలి...

- శ్రీభాష్యం శ్రీనివాసాచార్య గురుస్వామి



దీక్షాధారులు నియమ నిబంధనలు పాటిస్తూ దీక్షను ద్విగుణీకృతం చేసుకోవాలి. ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం. భక్తిభావన, ఆధ్యాత్మిక చింతన అవసరం. ఇతరుల పట్ల ప్రేమ, సోదరభావం, సహనం, గౌరవం, ఆదరాభిమానాలతో మెలగాలి. మనసారా స్వామిని మదిలో నిలుపుకోవాలి.

దీక్షా కాలంలో నియమ నిబంధనలు



- దీక్ష తీసుకున్న వ్యక్తి పీఠాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతినిత్యం రెండు పూటలా తలస్నానం ఆచరించాలి. లఘు శంకకు వెళితే పాద ప్రక్షాలన, దీర్ఘ శంకకు వెళితే కంఠ స్నానం చేయాలి.
- నలుపు రంగు దుస్తులు ధరించాలి. మత సంప్రదాయాలను అనుసరించి తిరుమణి, శ్రీచూర్ణం, విభూతి, చందనం, గంధం, కుంకుమ బొట్టు ధరించాలి.
- రెండు పూటలా పూజలు, నిత్య ఆరాధన చేయాలి. తొలిసారి దీక్ష తీసుకున్న వారు పెద్ద పాదం నడవాలి. ప్రతిసారి నడవవచ్చు.
- ఒకే పూట అన్నం, రెండవ పూట సాయంత్రం అల్పాహారం స్వీకరించాలి.
- భూశయ్య, బ్రహ్మచర్యం పాటించాలి. ఆధ్యాత్మిక పుస్తకాలు చదవాలి.
- ఇంద్రియ నిగ్రహం పాటిస్తూ సాత్వికాహారం తీసుకోవాలి.
- ఆహార పదార్థాలను వృధా చేయకూడదు.
- మిత, మృదు భాషణ చేయాలి. పరుష వాక్కులు కూడదు.
- పాద రక్షలు ధరించరాదు.
- రక్త సంబంధీకులు, పాలివాళ్ళు మరణిస్తే మాల విసర్జన చేయాలి. సంవత్సర సూతకులకు ఆ యేడు దీక్ష కూడదు.
- పడి పూజలు, భజనల్లో పాల్గొనాలి. ఒక్క మారైనా అన్నదానం చేయాలి.

శబరిమల యాత్రలో జాగ్రత్తలు

దీక్షాకాలంలో కఠిన నియమాలు పాటిస్తూ గడపడం ఎంత ముఖ్యమో శబరిమలయాత్ర చేయడం అంతే ముఖ్యం. యాత్రలో కొన్ని నియమాలు పాటించాల్సి ఉంటుంది. అవగాహనా లోపంతో అష్ట కష్టాలు పడటం కంటే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే యాత్ర సఫలమవుతుంది. ఏ స్థాయి దీక్షాపరులైనా ఈ నియమాలు గుర్తుంచుకొని యాత్ర సాగిస్తే అయ్యప్ప కరుణాకటాక్ష వీక్షణాలు ఎల్లపుడూ ఉంటాయి. ఆ నియమాలు మీకోసం..



- గురుస్వామితో ఇరుముడి ధరించే ముందు రోజే ఇరుముడి సామగ్రితోపాటు మార్గమధ్యలో తినడానికి అల్పాహారం సిద్ధం చేసుకోవాలి.
- కప్పుకునేందుకు, పరచుకునేందుకు రెండు చద్దర్లు, దిండు, దీక్షా వస్త్రాలు, టవల్స్ వంటివి సిద్ధం చేసుకోవాలి.
- ఒక టార్చ్ లైట్, ఒక వాటర్ బాటిల్, ఒక పొడుగాటి కర్ర (అక్కడిదైనా పరవాలేదు), బిస్కట్లు, గ్లూకోజ్ లేదా పండ్ల రసాల బాటిల్ ఉంచుకోవాలి.
- దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అవసరమయ్యే మందులు, మామూలువారు జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, తదితర రుగ్మతలకు సంబంధించిన మందులు ఉంచుకోవాలి.
- సామాను ఎక్కువగా కాకుండా అన్నీ ఒకే బ్యాగులో పట్టేలా సర్దుకోవాలి.
- వాహనాల్లో, సర్వీసుల్లో వెళ్లేవారు మొదలే రూట్‌పై అవగాహన కలిగియుండాలి. ఇతర యాత్రలను వెళ్లేప్పుడుకానీ వచ్చేప్పుడుకానీ చేయవచ్చు.
- యాత్రలో మధ్యమధ్యలో ఆగడానికి సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలి. పాదయాత్రలో గురుస్వామితో కలిసి గుంపులు గుంపులుగా వెళ్లాలి. అడవి ప్రాంతం కావడంతో అనుక్షణం జాగ్రత్తగా ఉండాలి.
- సన్నిదానంలో మొక్కుల అనంతరం పదునెట్టాంబడి ఎక్కేముందు అతి జాగ్రత్త అవసరం. నెట్టుకోకుండా నెమ్మదిగా వెళితే దెబ్బలు తగలకుండా ఉంటుంది.
- స్వామి, మకరజ్యోతి దర్శనం తర్వాత ఉరుకులు, పరుగులు కూడదు. తొక్కిసలాట జరిగే అవకాశం ఉంటుంది.

మహిళలు ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు చాకలి ఐలమ్మను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మే డిపల్లి సత్యం అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో మహిళా విశ్వ విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టి గౌరవించిందన్నారు. అంతకుముందు మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించే పల్లె దవాఖాన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండలంలోని రజకసంఘం నాయకులు శంకర్, లక్ష్మన్, రాజు, గంగాధర్, రాజయ్య, జిల్లా వైద్య ఆ రోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ షాప్‌లో చోరీకి యత్నం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ముకరంపురలోని ఒక మొబైల్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారు. షాప్ యజమాని సాయిరాం శనివారం రాత్రి 10 గంటలకు షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు మొబైల్ షాప్ సగం వరకు తెరిచి ఉన్నట్లు గమనించి స్థానికులు సాయిరాంకు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు క్యాష్ కౌంటర్ తెరచి చూశారని, షాపులో ఎలాంటి వస్తువులు, డబ్బులు పోలేదని సాయిరాం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కోర్టు ఉద్యోగి

కొడిమ్యాల, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టులో ఉద్యోగం చేస్తున్న మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన ముదాం శంకర్ నిజాయితీ చాటుకున్నాడు. శంకర్ శనివారం కరీంనగర్‌కు వెళ్తుండగా పర్సు దొరికింది. గ్రామస్థులకు పర్సు దొరికిన విషయం తెలిపాడు. పర్సులో ఉన్న ఆధార్‌కార్డుతో గంగాధర మండలం ఇస్లాంపురం గ్రామానికి చెందిన దయ్యాల కొమురయ్యదిగా గ్రామస్థులు గుర్తించారు. పర్సులో ఉన్న 15 వేల నగదును కోర్టు ఉద్యోగి బాధితుడికి అందజేశాడు.

పంటలను ధ్వంసం చేస్తున్న అడవి పందులు



చందుర్తి మండలంలో అడవి పందులు ధ్వంసం చేసిన వరినారు

చందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్, మల్యాల, లింగంపేట పలు గ్రామాల్లో అడవి పందులు వరినారుతో పాటు చేతికందిన పత్తి, కంది పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అడవి పందుల బెడద నుంచి తమ పంటలను కాపాడుకోవడానికి రైతులు రాత్రి సమయాల్లో కాపు కాస్తున్నారు. అయినప్పటికీ అడవి పందులు అర్ధరాత్రి గుంపులు గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేసి పోతున్నాయి. మండలంలోని పలు గ్రామాలు గుట్ట, అడవి ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. అర్ధరాత్రి వేళ గుంపులు, గుంపులుగా పందులు పంటలపై దాడికి పాల్పడి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది.

పంటలు చేతికి వచ్చే సమయంలో అడవి పందులు గుంపులుగా దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల గ్రామానికి చెందిన దమ్మ రవి అనే రైతుకు చెందిన పొలంలోని వరి నారును ధ్వంసం చేశాయి. అడవి పందుల బెడద నుంచి తమకు రక్షణ కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

సింగారంలో వ్యవసాయ కూలీ బలవన్మరణం

ఎలారెడ్డిపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలోని వ్యవసాయ కూలీ వాసరి పెద్ద బాలయ్య(57) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్‌ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు పెద్ద బాలయ్య వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని జీవిస్తుండేవాడు. పదేళ్ల కిందట అతని భార్య పద్మ అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి మనస్థాపానికి గురైన పెద్ద బాలయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న రాత్రి అతని తల్లి లక్ష్మీ ఇంటిలో భోజనం చేసిన పెద్దబాలయ్య తన ఇంటికి వెళ్లి నిద్రించాడు. ఆదివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఆయన కొడుకు రాజు తలుపులను తట్టాడు. భవన స్లాబ్‌కు పెద్దబాలయ్య ఉరి వేసుకుని కనిపించాడు. చుట్టు పక్కల వారి సహాయంతో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన వ్యక్తి

గన్నేరువరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కారు డ్రైవర్ గాయపడిన బాధితుడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మృతుడి పేరు, ఊరు తెలియదని, అతడు సుమారు 30 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఫొటోఆధారంగా ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మృతిడి తరఫున ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పొలంలోకి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం.. ఒకరి మృతి

కోనరావుపేట డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన బెజిగం అనిల్ (37) అనే యువకుడు ఆదివారం ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లడంతో మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని శివంగాలపల్లికి చెందిన అనిల్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. అత్తగారి గ్రామం కనగర్తికి వెళ్తుండగా నిజామాబాద్ శివారులోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో బైక్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. గాయాలవడంతో పొలంలో పడి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి

బీర్‌పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో గాయాలపాలై చికిత్స పొందుతూ బత్తిని పుష్ప(40) మృతి చెందినట్లు ఎస్సై కుమార స్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గుండ భూమక్క లింగన్నల కుమార్తె పుష్పను సారంగాపూర్ మండలంలోని బట్టపల్లి గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్‌కు ఇచ్చి 20 ఏళ్ల క్రిం రెండో వివాహం చేశారు. దంపతులిద్దరూ తరచూ గొడవ పడేవాడు. ఈ నెల 13న కూడా శ్రీనివాస్ పుష్పతో గొడవ కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జగిత్యాలకు తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పుష్ప తల్లి భూమక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీకి చెందిన నోముల వంశీకృష్ణ(25) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన వంశీకృష్ణ ఆరు నెలల నుంచి హైదరాబాద్‌లోని ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 13న కాలనీకి వచ్చిన వంశీకృష్ణ రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వంశీకృష్ణ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చదువుకు తగిన ఉద్యోగం రాలేదని మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యవసాయ బావిలో శిశువు మృతదేహం

మేడిపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆదివారం నవజాత శిశువు మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. గ్రామస్థుల ద్వారా సమాచరం తెలుసుకున్న పోలీసులు మగ శిశువు మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గడ్డం గంగారెడ్డికి చెందిన వ్యవసాయ బావి రోడ్డుకు పక్కన ఉండటంతో మృతి చెందిన శిశువును ఎవరైనా పడివేశారా లేక ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

జమ్మికుంట To తమిళనాడు

- పత్తి బేళ్ల తరలింపు
- రెండు దశాబ్దాలుగా వ్యాపారం



జమ్మికుంట రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి వ్యాపార కేంద్రంగా జమ్మికుంట గుర్తింపు పొందింది. ఇక్కడ మార్కెట్‌కు వచ్చిన పత్తిని ఖరీదుదారులు కొనుగోలు చేసి బేళ్లుగా తయారు చేసి వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ఉన్న తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తారు. జమ్మికుంటలో రెండు దశాబ్దాలకు పైగా పత్తి వ్యాపారం సాగుతోంది. ఒకప్పుడు జమ్మికుంట మార్కెట్లో అపరాలు, వరి ధాన్యం కొనుగోళ్లు భారీగా జరిగేవి. ఈ ప్రాంత రైతులు పండించిన పంటలే కాకుండా చుట్టు పక్కల మండలాలు, జిల్లాల నుంచి కూడా రైతులు తాము పండించిన ధాన్యం, వేరుశనగ, పెసర్లు, మొక్కజొన్నలు, శనగలు జమ్మికుంట మార్కెట్‌కు తీసుకువచ్చేవారు. అందుకు తగ్గట్టుగానే పట్టణంలో రైస్ మిల్లు, నూనె మిల్లులు ఏర్పడ్డాయి. రెండున్నర దశాబ్దాల క్రితం నుంచి ఈ ప్రాంతంలో పత్తి పండించటం, ఆ పంటను స్థానికంగా ఉన్న వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు కమీషన్‌పై తరలించేవారు. క్రమక్రమంగా స్థానికంగా జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రత్యేకంగా పత్తి కొనుగోలు కోసం 2003లో కేశవపూర్ రోడ్డులోని నూతన వ్యవసాయ మార్కెట్‌ను అప్పటి మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి నిత్యం కోట్లాది రుపాయల పత్తి వ్యాపారం సాగుతోంది. ప్రతి రోజు 20వేల పత్తి బస్తాల పైచిలుకు రైతులు విక్రయానికి తీసుకువచ్చేవారు. దీంతో మార్కెట్ అంతా తెల్ల బంగారంతో నిండిపోయేది. పత్తి దిగుబడులు క్రమేపీ పెరుగడంతో జిన్నింగ్ మిల్లులు అదే తరహాలో పెరుగుతూ వచ్చాయి. మార్కెట్‌కు వచ్చిన పత్తిని ఖరీదుదారులు కొనుగోలు చేసి, వారి మిల్లుల్లో జిన్నింగ్, ప్రెస్సింగ్ చేసి బేళ్ల తయారు చేస్తారు. వాటిని వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలైన తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్, మధురై, తిరుపూర్, తిర్నలవేలి, శీలం, రాజాపాలేం ప్రాంతాల్లో విక్రయిస్తారు. అక్కడ కోట్లలో పత్తి బేళ్ల విక్రయాలు జరుపుతున్నప్పటికీ నమ్మకంపై ఆధారంగానే విక్రయాలు జరుపుతుంటారు. ఇక్కడి నుంచి పత్తి బేళ్లతో బయలుదేరిన లారీలు కానరాకుండాపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.



మార్కెట్‌కు వచ్చిన పత్తి

తగ్గిన జిన్నింగ్ మిల్లులు

రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సంతరించుకున్న జమ్మికుంట పత్తి మార్కెట్ ప్రస్తుతం కొంత కళ తప్పిందని చెప్పవచ్చు. పట్టణంలో 18వరకు జిన్నింగ్ మిల్లులు ఉండేవి. సుమారు 30మంది పైచిలుకు వ్యాపారులు పత్తి కొనుగోళ్ల చేపట్టేవారు. ప్రస్తుతం ఆరు మిల్లులు మాత్రమే నడుస్తున్నాయి. ఇక్కడ లాభాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో వ్యాపారం కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా కార్మికులు, కూలీలకు ఉపాధి తగ్గింది. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పూర్వవైభవం కోసం తగు రీతిలో చర్యలు చేపడితే వ్యాపారం కళకళలాడి ఉపాధి మార్గాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మంథని, డిసెంబరు 15: పట్టణంలోని పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పరామర్శించారు. మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలో ఇటీవల సంగినవేని పోచం, పోచమ్మ వాడలో పిల్లి సాయికిరణ్ మృతి చెందగా వారి కుటుంబాలను పుట్ట మధు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజలు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. చిత్ర పటాల వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, గొబ్బూరి వంశీ, కనుకరాజ్‌లు ఉన్నారు.

బస్సు జాత పోస్టర్ ఆవిష్కరణ

మంథని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యల సాధన కోసం ఈనెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వస్తున్న బస్సు జాతను వాల్ పోస్టర్‌ను సీఐటీయూ నేతలు జ్యోతి, గణేష్, సందీప్‌లు ఆదివారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు రూ. 18 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. బస్సు జాత కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి అధిక సంఖ్యలో ఆశా వర్కర్లు తరలి రావాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతి

సుల్తానాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కసిరెడ్డి నారాయణరెడ్డి (75) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నారాయణరెడ్డి 1986 నుంచి 1996 వరకు పది సంవత్సరాలుగా కనుకుల గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించారని పలువురు కొనియాడారు. ఆయన మృతి పట్ల మండలంలోని పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఏబీవీపీ హైదరాబాద్ సిటీ జాయింట్ సెక్రెటరీగా ఆదిత్య

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ హైదరాబాద్ సిటీ జాయింట్ సెక్రెటరీగా కరండ్ల ఆదిత్య నియామకం పట్ల పలువురు జిల్లా ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 10న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఏబీవీపీ గ్రేటర్ హైదరబాద్ మహాసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా జగిత్యాలకు చెందిన కరండ్ల ఆదిత్యను సిటీ జాయింట్ సెక్రెటరీగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నియమించారు. ఆదిత్య ప్రస్తుతం నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 2వ సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థి నాయకుడిగా ఎల్‌బీనగర్ కేంద్రంగా అనేక ఉద్యమాలు నిర్వహించగా, విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఆదిత్యకు సిటీ జాయింట్ సెక్రెటరీగా బాధ్యత రావడం పట్ల సిటీ అధ్యక్ష, కార్యదర్శితో పాటు జగిత్యాలకు చెందిన పూర్వ ఏబీవీపీ బాధ్యులు అన్నల్‌దాస్ మురళి, మహేష్, దేవయ్య, ముదుగంటి రవీందర్‌రెడ్డి, ఏసీఎస్ రాజు, సంపూర్ణచారి అభినందించారు.

నవోదయ విద్యాలయాల కేటాయింపు హర్షణీయం

రాయికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అత్యున్నతమైన ప్రమాణాలతో సెంట్రల్ సిలబస్‌తో కూడిన ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలను తెలంగాణకు కేటాయించడం హర్షణీయమని తెలంగాణ యాదవ మహాసభ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్ నగర్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలకు జవహర్ నవోదయ విద్యాలయాలను కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా సంఘం పక్షాన ప్రధాన మంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

● మొదటిరోజు ప్రశాంతం ● ఉదయం 49.34 శాతం.. సాయంత్రం 48.98 శాతం హాజరు


గోదావరిఖని జెడ్పీ బాలికల పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు


ఖనిలో పరీక్ష కేంద్రం వద్ద పరిశీలన జరుపుతున్న సీపీ శ్రీనివాస్

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న గ్రూప్-2 పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో గ్రూప్2 నిర్వహణ కోసం 18 పరీక్ష కేంద్రాలను కేటాయించగా ఆదివారం జరిగిన మొదటి పేపర్ రెండవ పేపర్‌కు అభ్యర్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. ఉదయం 10 గంటలకు నుండి 12.30 గంటల వరకు నిర్వహించిన మొదటి పేపరు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాలలో కేటాయించబడిన అభ్యర్థులు 9,018 మంది హాజరు కావాల్సి ఉండగా 4,449 మంది హాజరయ్యారు. 49.34 శాతం అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆయా సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు జరిపారు. రెండవ పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగాయి. మధ్యాహ్నం పరీక్షకు 4,450 మంది అభ్యర్థులు హాజరు కాగా, 4,568 మంది అభ్యర్థులు గైర్హజరయ్యారు. హాజరు 48.98 శాతానికి పడిపోయింది. అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ మొదటి రోజు జరిగిన రెండు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

● ఆలస్యంగా వచ్చినవారిని అనుమతించని అధికారుల

కోల్‌సిటీటౌన్: టీజీపీఎస్‌సీ గ్రూప్-2 పరీక్షలు ఆదివారం గోదావరిఖనిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గోదావరిఖనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మార్కండేయకాలనీలోని చైతన్య డిగ్రీ కళాశాల, అశోక్‌నగర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఉదయం 8.30గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 9.30గంటల తరువాత వచ్చిన అభ్యర్థులను అధికారులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. 10గంటలకు పరీక్ష ప్రారంభమైంది. 9.30గంటల తరవాత ఈ నాలుగు పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన 8 మంది అభ్యర్థులను అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించకపోవడం నిరాశతో వెనుదిరిగారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. బందోబస్తులో వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, కె.రవీందర్, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

జేఎన్టీయూ పరీక్ష కేంద్రంలో..

రామగిరి: జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పరీక్షలో 932 మంది అభ్యర్థులకు గాను 492 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ముగ్గురు అభ్యర్థులు నిర్ణీత సమయానికి కేంద్రానికి చేరుకోకపోవడంతో పరీక్షకు అనుమతించలేదు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో932 మందికి 489 మంది అభ్యర్థులు హాజరు కాగా 433 మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్స్‌పాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు ఏడుగురు అంగవైకల్య అభ్యర్థులకు సహాయకులతో పరీక్ష రాయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా మంథని సిఐ రాజు, రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ భద్రతను ఏర్పాటు చేశారు.

15రూట్‌లలో 411మంది సిబ్బందితో బందోబస్తు : సీపీ

కోల్‌సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలకు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో 66కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్టు కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల పట్టణంలోని ఆర్‌బీహెచ్‌వీ హైస్కూల్, ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల్లోని పరీక్ష కేంద్రాలను కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. 15రూట్‌లలో 411మంది సిబ్బంది విధులు నిర్వహించారని, సాయుధ దళాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీపీ పేర్కొన్నారు. పరీక్షల అనంతరం ఎగ్జామ్ షీట్‌లను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించామన్నారు. ఈ బందోబస్తులో మంచిర్యాల డీసీపీ భాస్కర్, గ్రూప్-2 ఎగ్జామ్ నోడల్ అధికారి, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ-2 రవీందర్, మంచిర్యాల సీఐ ప్రమోద్ రావు, లక్సెట్టిపేట సీఐ నరేందర్ పాల్గొన్నారు.



గోదావరిఖనిలో పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థి పరుగు


జేఎన్‌టీయూ వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్ తనిఖీ చేస్తున్న అధికారులు

గజ..గజ..

● కనిష్ఠ స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు


మంథనిలో చలిమంట కాగుతున్న ప్రజలు

మంథని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా క్రమేపీ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండటంతో చలితీవ్రత పెరిగింది. చలితో జనం గజ గజ వణుకుతున్నారు. చలి పంజా నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంథని ప్రాంతంలో గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పడిపోతున్నాయి. పగలు గరిష్ట ఉష్ణోగ్రతలు 25 డిగ్రీలు నమోదు అవుతుండగా సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉష్ణోగ్రతలు 9 డిగ్రీల కనిష్ఠ స్థాయికి పడిపోతుండటంతో చలి తీవ్రత పెరిగిపోయింది. దీంతో జనం చలి మంటలు వేసుకొని వెచ్చదనం కోసం ప్రయత్నిస్తున్నారు. నలుగురు కూర్చున్న వద్ద మంటలు కాగుతున్న వారే దర్శిమిస్తున్నారు. సాయంత్రం నుంచే స్వెటర్స్, ఉన్ని దుస్తులను ధరిస్తూ ఉదయం 9 తరువాత వరకు వాటితోనే కొనసాగుతున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు, తెల్లవారు జాము నుంచి ఉదయం వరకు బైక్‌లపై ప్రయాణించడానికి సాహసించడం లేదు. అత్యవసరం అయితేనే తప్ప దూర ప్రయాణాలు చేయడం లేదు. అత్యవసరం అయితే తప్ప జనం రాత్రి సమయాల్లో బయకు రావడం లేదు. చలికి తోడు తెల్లవారుజామున పొగమంచు కప్పి వేస్తోంది. ఉదయం 7 గంటలైనా పొగమంచు కమ్ముకోవడంతో జనం ఇళ్ల నుంచి బయటికి రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చలితో అస్తమా వ్యాధిగ్రస్తులతో పాటు చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. తెల్లవారుజామున వివిధ గ్రామాల నుంచి కూరగాయలు, పాలను మంథని మార్కెట్‌కు తీసుకు వచ్చే రైతులు, పేపర్‌బాయ్స్, బస్టాండ్, ప్రధాన రహదారుల వెంట ఉన్న టీ స్టాల్స్, హోటళ్ల యజమానులు, రోడ్లను క్లీన్ చేసే మున్సిపల్ సిబ్బంది, వాకర్స్ చలితో జాగ్రత్తలు తీసుకుకంటూ పనులు చేసుకుంటున్నారు. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పడిపోతుండటంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

కోల్‌సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గౌతమినగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో శనివారం రాత్రి ఘనంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. వాసవ్య విద్యాలయం నిర్వాహకులు బండి చంద్రమౌళి, బండి విక్రమ్ దంపతుల ఆధ్వర్యంలో ఈ పడిపూజ జరిగింది. అర్చకులు రాంపెల్లి మురళీధర్‌శర్మ, గురు స్వామి ఆడెపు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు అర్ధరాత్రి వరకు భజన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఎఫ్‌సీఐ టౌన్‌షిప్, గౌతమినగర్, ఎన్‌టీపీసీ, రామగుండం, యైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని అయ్యప్ప దేవాలయాలకు చెందిన గురుస్వాములు, పలువురు పూజారులు హాజరయ్యారు.

ఆకట్టుకున్న నృత్య పోటీలు


విద్యార్థుల నృత్య ప్రదర్శన

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): డ్రీం జూనియర్ కాలేజీ సౌజన్యంతో ఆదివారం స్థానిక కమ్యూనిటీహాల్‌లో డ్రాయింగ్, ఫోక్ డ్యాన్స్ పోటీలు అలరించాయి. జిల్లాలోని 18 పాఠశాలలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పందన మోడల్ స్కూల్, ట్రస్మా సభ్యులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్న దంపతులకు సన్మానం

సుల్తానాబాద్, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి): గత రెండు దశాబ్దాలకు పైగా ఈ ప్రాంతంలో పేతలను ఆదుకుంటున్న ప్రభుత్వ రిటైర్డు ఉపాధ్యాయ దంపతులు అల్లం భాగ్యలక్ష్మి, సత్యనారాయణలను ఘనంగా సన్మానించారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన అల్లం సత్యనారాయణ, భాగ్యలక్ష్మి దంపతులు ఇద్దరు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. వీరిద్దరూ కొన్నేళ్ల నుంచి అనేక మంది పేదలకు వస్తు రూపంగా, డబ్బు రూపంగా సహాయం చేస్తున్నారని, పేద విద్యార్థులకు పరీక్ష ఫీజులకు, పేద అమ్మాయిల వివాహానికి, ఆసుపత్రిలో వైద్య ఖర్చులకు సహాయం చేశారని కొనియాడారు. వందల మందికి వివిధ సందర్భాలలో అన్నదానం చేశారని అన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులు తొర్రికొండ ప్రభాకర్, గురుస్వాములు మాటేటి శ్రీనివాస్ తదితరులు సత్యనారాయణ భాగ్యలక్ష్మి దంపతులను శనివారం ఘనంగా సన్మానించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సుల్తానాబాద్, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి): మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉండాలంటే తప్పనిసరిగా తరుచుగా వారి దంత వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం సంజీవ్ కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో తెలంగాణ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మణిదీప్ ఆధ్వర్యంలో పల్లె దంత సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు ఈ శిబిరంల దంత పరీక్షలు చేయించుకున్నారు. పలువురు దంత వైద్య నిపుణులు మాట్లాడుతు సంపూర్ణ ఆరోగ్య వంతులు గా ఉండాలంటే దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా పిల్లలకు చిరుతిళ్ళ అలవాటు ఉంటుందని వారి విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని నోటి వ్యాధులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దంత వైద్య స్టూడెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ శ్రీజ గజవెల్లి, లయన్స్ క్లబ్ ప్రతినిదులు మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, వెంకటేశం, సాంబమూర్తి, పల్ల అనిల్ కుమార్, నోముల వేణుగోపాల్, నాగమల్ల ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆడ్రియాల ప్రాజెక్టులో భద్రతా పక్షోత్సవాలు

రామగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని వీటీసీలో భద్రతా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహించే 55వ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం అడ్రియాల ప్రాజెక్టులో భద్రత తనిఖీ బృందం కన్వీనర్ కోటిరెడ్డి, కమిటీ బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా భద్రతపరమైన అంశాలపై జీఎం వెంకటేశ్వర్లు, కన్వీనర్ కోటిరెడ్డి కార్మికుల్లో అవగాహన కల్పించారు. ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు బండి సత్యనారయణ, సుర్జిత్, శ్రీనివాస్, తనిఖీ బృందం సభ్యులు వీఎస్ ఇందా, జ్ఞాన సంబంధన్ తదితరులు పాల్గొన్నారు.

'రిటైర్డు కార్మికుల పింఛన్ , ఎరియర్స్ చెల్లించాలి'

మందమర్రి టౌన్, డిసెంబర్ (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో దశాబ్దాల పాటు సంస్థ అభివృద్ధికి పనిచేసి స్వచ్ఛంద విరమణతో పాటు మెడికల్ ఇన్‌వాలిడ్ ద్వారా అన్‌ఫిట్ అయిన వారికి 11వ వేజ్‌బోర్డు ప్రకారం పింఛన్, ఎరియర్స్ చెల్లించేలా చూడాలని కోరుతూ ఆదివారం సాయంత్రం ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్యకు విన్నవించారు. ఈ సందర్భంగా రిటైర్డు కార్మికులు వాసాల శంకర్, వడ్లకొండ వీరయ్య మాట్లాడుతూ తాము ఉద్యోగ విరమణ పొంది సంవత్సరాలు గడుస్తున్నా ఎరియర్స్ అమలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. విరమణ తర్వాత సంస్థకు తాము చేసిన సేవలను మర్చిపోతున్నారని పేర్కొన్నారు. సంస్థలో పని చేసిన తర్వాత ఉద్యోగ విరమణ సందర్భంలో పొగడ్తలతో సన్మాన పత్రాలు అందజేసిన యాజమాన్యం తమను పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులు ఏఐటీయూసీపై ఎంతో నమ్మకం పెట్టుకొని గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నామని, తమ పరిస్థితిని అర్థం చేసుకొని వేజ్‌బోర్డు ఎరియర్స్‌తో పాటు పెన్షన్ ఇప్పించాలన్నారు. గతంలో పది లక్షల గ్రాట్యుటీ సీలిం గ్ ఉండేదని, 29.3.2018 నుంచి 20 లక్షలకు పెంచాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో 1.1.2017 నుంచి 20.8.2018 మధ్యలో విరమణ పొందిన కార్మికులు గ్రాట్యుటీ ఎరియర్స్ లెక్కించి ఇవ్వాలన్నారు. సీపీఆర్ఎంఎస్ పథకానికి సంబంధం లేకుండా వైద్యం అందించాలని వారు కోరారు.

సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజల ఇబ్బందులు

● ప్రైవేట్ స్థలాల్లోకి చొచ్చుకువచ్చి మొక్కలు నాటుతున్న యాజమాన్యం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 సింగరేణి యాజమాన్యం సంస్థ పరిధిని దాటి ప్రైవేట్ స్థలాల్లో ప్రవేశించడం వివాదాస్పదం అవుతున్నది. సింగరేణి పరిధి ఎంత వరకు ఉన్నదనే విషయాన్ని విస్మరించడంతో సంస్థ అభివృద్ధికి భూములను ఇచ్చిన ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలోని పెట్రోల్ బంక్ స్థలంలో కొంత భాగాన్ని ముందు వెనకచూడకుండా ధ్వంసం చేసిన తర్వాత జరిగిన పొరపాటును గుర్తించి నష్ట నివారణ చర్యలు తీసుకున్నారు. సింగరేణి భవిష్యత్తు అవసరాలు, ప్రాజెక్టుల విస్తరణ దృష్ట్యా సమీప ప్రాంతాల్లోని భూములను పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకున్నది. కానీ ఎంత వరకు సంస్థ పరిధి ఉన్నదనే విషయాన్ని ఆర్జీ-2 అధికారులకు అవగాహన లేకపోవడం ప్రభావిత గ్రామాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఎస్టేట్ అధికారుల అవగాహనా రాహిత్యం, అనాలోచిత చర్యలు ప్రభావిత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది.

రామగిరి మండల పరిధిలోని పలు ప్రైవేట్ స్థలాల్లో సింగరేణి చొరబడి ప్రైవేట్ వ్యక్తుల ఆస్తుల్లో చట్ట విరుద్ధంగా పాగా వేస్తున్నది. గడిచిన రెండు మూడు నెలల వ్యవధిలో ఇటువంటి ఘటనలు జరిగినా అధికారులు తప్పిదాలను సరిదిద్దుకునే ప్రయత్నాలు చేయడం లేదు. తాజాగా రామగిరి మండలం దుబ్బపల్లె గ్రామానికి చెందిన రైతులు తమకు కనీస సమాచారం లేకుండా అక్రమంగా ప్రవేశించి మొక్కలు నాటినట్టు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. ఉప్పట్లకేసారం గ్రామానికి చెందిన గట్టు రాములు కుటుంబీకులుకు సంబంధించిన భూమిలో మొక్కలు నాటడం, నరికి వేయడంపై హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా దుబ్బపల్లె గ్రామానికి చెందిన కొత్వాల రాజయ్య కుటుంబీకులు సైతం న్యాయ పోరాటినికి సిద్ధమయ్యారు. దుబ్బపల్లె శివారులోని సర్వే నంబర్ 213లో 20 గుంటలు, 214 సర్వే నంబర్‌లో 21 గుంటల భూమి కొత్వాల రాజయ్య కుటుంబ సభ్యులకు చెందినది. కాగా 2005లో తొమ్మిది ఎకరాల్లో 18 గుంటలు మినహా 8.22 గుంటల భూమిని సింగరేణి స్వాధీనం చేసుకుని పరిహారం సైతం చెల్లించింది. మధ్యలో 18 గుంటల భూమిలో యజమానులైన రాజయ్య కుటుంబ సభ్యులకు కనీస సమాచారం లేకుండా చుట్టూ గుంత తవ్వి నీలగిరి మొక్కలను సింగరేణి నాటింది. స్వాధీనం చేసుకున్న భూ పరిధికి మించి తమ పేరిట ఉన్న భూమి చుట్టూ కందకం తవ్వడం, చెట్లు నాటడంపై రాజయ్య కుటుంబ సభ్యులు సింగరేణి అధికారులను పలు మార్లు కలసినా స్పందిచకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. సాగుకు అక్కరకు రాని భూమి, అమ్మకానికి వీలుకాని భూమిని తమకు మిగల్చడం భావ్యం కాదని, 18 గుంటల భూమిని సైతం సింగరేణి స్వాధీనం చేసుకుని పరిహారం చెల్లించాలని కొత్వాల రాజయ్య కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. కాగా నిబంధనలు పాటించకుండా, పరిధులను గుర్తించకుండా సింగరేణి ఎస్టేట్ విభాగం వ్యవహరిస్తోందనే విమర్శలు ఉన్నాయి.


ప్రైవేటు స్థలంలో సింగరేణి నాటిన మొక్కలు

రాష్ట్ర స్థాయి కూచిపూడి పోటీల్లో ప్రతిభ

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శనలో మెట్‌పల్లి పట్టణంలోని మీనాక్షి నృత్య కళా నిలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళా నిలయం విద్యార్థులు హైదరాబాదు లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గల ఎన్టీఆర్ కళా మందిరంలో ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సహకారంతో శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవ సందర్భంగా తెలుగు రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కళా నిలయం ఉపాధ్యాయురాలు శ్రీవాణి ఆధ్వ ర్యంలో నిలయంలో నృత్యం నేర్చుకున్న విద్యార్థులు అంకతి విశ్వంభర, శ్రీ గాయత్రి హర్షాలి, అక్షిత రిత్వక, వైజ్ఞానిక, నత్యి శ్రీ, శ్రీకృత, సుదీక్ష ప్రతిభ కనబరిచారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మెమెంటో అందించి అభినందించారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

సుల్తానాబాద్, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ ను వెలికతీయడమే లక్ష్యంగా అల్ఫోర్స్ విద్యా సంస్థలు పనిచేస్తున్నాయని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. గణిత శాస్త్ర పితా మహుడు రామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ స్కూల్‌లో ఏమాట్ -2024 పేరిట మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహిం చారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 517 మంది విద్యార్థులు పాల్గొని ఈ పరీక్షల్లో ప్రతిభను చాటుకు న్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లా డుతూ ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రతిభ పరీక్ష రాస్తున్న విద్యార్థులు